భార్యకు ప్రేమతో... 7లో...

నేడు ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ రాక

అనంతపురం సిటీ, సెప్టెంబరు 14 : ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ నయీముల్లా ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఉదయం కణేకల్లు హెచ్చెల్సీ వంతెన, బెళుగుప్ప మండలంలోని రామసాగరం బ్రిడ్జి పనులను ఆశాఖ అధికారులతో కలిసి పరిశీలిస్తారు. తర్వాత అనంతపురం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగే ఇంజనీర్స్ డే వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం శ్రీసత్యసాయి జిల్లాలోని తమ స్వగ్రామమైన చిలమత్తూరుకు వెళతారు.















19న ఐఏబీ సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్: ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశం ఈనెల 19న ఉదయం 11గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహిస్తామని ఐఏబీ ఛైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్, కన్వీనర్, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. టీబీ డ్యాంలో నీటి నిల్వ ఆధారంగా హెచ్చెల్సీకి 26.368 టీఎంసీల నీటిని కేటాయించారని తెలిపారు. ఇందులో జిల్లా తాగునీటి అవసరాలకు పది టీఎంసీలను కేటాయిస్తామని, మిగిలిన 16.365 టీఎంసీలను లక్ష ఎకరాల్లో ఆరుతడి పంటల సాగుకు ఇస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ఇందులో మార్పులు, చేర్పులు చేస్తామని తెలిపారు. అవసరానికి అనుగుణంగా ఆన్ అండ్ ఆఫ్ విధానాన్ని అమలు చేసి, నీటి కొరత రాకుండా చూస్తామని అన్నారు. నీటి చౌర్యం, వృథా, అనధికారిక వినియోగాన్ని అరికడుతామని అన్నారు. హంద్రీ నీవా, మైనర్ ఇరిగేషన్‌తో పాటు హెచ్చెల్సీకి కేటాయించిన నీటి విడుదల తేదీలను ప్రకటిస్తామని తెలిపారు. ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు.

హార్టీ సెట్‌లో టాప్ ర్యాంక్



తల్లిదండ్రులతో విజయలక్ష్మి

బెళుగుప్ప, సెప్టెంబరు 14: దుద్దేకుంట ఎస్సీ కాలనీ విద్యార్థిని విజయలక్ష్మి హార్టీ సెట్‌లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంక్ సాధించింది. ఆర్డీటీ సహకారంతో మడకశిర హార్టికల్చర్ కాలేజీలో పాలిటెక్నిక్ పూర్తి చేశానని, హార్టీసెట్‌లో నూటికి 83.50 మార్కులు సాధించానని విద్యార్థిని తెలిపింది. ఆర్డీటీ సంస్థకు కృతజ్ఞతలు తెలిపింది.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి సేవలందించండి

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 14 : జిల్లాలోని ఆర్యవైశ్య అఫిషియల్స్ పెన్షనర్స్ అసోసియేషన్(అవోపా) నాయకులు ఆర్యవైశ్యుల సంక్షేమానికి సేవలందించాలని అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తడపర్తి రాంబాబు సూచించారు. జిల్లాకేంద్రానికి శనివారం వచ్చిన ఆయనను అవోపా నగర కార్యదర్శి సత్రసాల మంజునాథ్ కలిశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యుల సంక్షేమానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించినట్లు మంజునాథ్ తెలిపారు.

విషజ్వరానికి విద్యార్థి బలి



అజయ్‌కుమార్ (ఫైల్)

బొమ్మనహాళ్, సెప్టెంబరు 14: విషజ్వరంతో విద్యార్థి మృతి చెందిన ఘటన బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి జోగి అంబోజి, నాగవేణి దంపతులు కుమారుడు అజయ్‌కుమార్ (7) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో బళ్లారిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. విషజ్వరం అని తేలడంతో బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. అజయ్‌కుమార్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. విద్యార్థి మృతి విషయం తెలుసుకున్న ఈఓపీఆర్డీ దాస్ గ్రామంలో విచారణ చేశారు. అజయ్‌కుమార్ కొద్ది రోజుల క్రితం రాయదుర్గంలోని బంధువులు ఇంటికి వెళ్లాడని, జ్వరం రావడంతో బళ్లారికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఎక్సైజ్‌శాఖకు మళ్లీ కళ

- సొంత శాఖకు అధికారులు, సిబ్బంది
- సెబ్ స్టేషన్‌ల పేరు తొలగింపు
- చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 14: ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది తిరిగి సొంత శాఖకు వచ్చేశారు. వైసీపీ హయాంలో సెబ్ ఏర్పాటుతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న 70 శాతం అధికారులు, సిబ్బంది అందులోకి వెళ్లారు. 30 శాతం మాత్రమే ఎక్సైజ్ శాఖ పరిధిలో ఉండిపోయారు. సెబ్ విధానం వల్ల ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. దీంతో కూటమి ప్రభుత్వం సెబ్‌ను రద్దు చేస్తూ శుక్రవారం రాత్రి జీవో జారీ చేసింది. సెబ్ స్టేషన్ల పేర్లు శనివారం తొలగించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లుగా మార్చారు. అనంతపురం, బుక్కరాయసముద్రం, గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, కణేకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, కంబదూరులో ఎక్సైజ్ స్టేషన్లు పాత పద్ధతిలోనే కొనసాగుతాయి. ఒక్కో స్టేషన్‌కు ఒక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్ఐలు, స్టేషన్ పరిధి ఆధారంగా ముగ్గురి నుంచి నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 9 నుంచి 13 మంది కానిస్టేబుళ్లను నియమించనున్నారు. అనంతపురం నగర పాలిక పరిధిలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఒక ఇన్‌స్పెక్టర్, ముగ్గురు ఎస్ఐలతోపాటు ఇతర సిబ్బందిని నియమిస్తారని సమాచారం. సెబ్‌ను రద్దు చేసి ఎక్సైజ్ అధికారులు, సిబ్బందిని మాతృశాఖకు రప్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం ఎక్సైజ్ స్టేషన్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎక్సైజ్ సీఐలు ఎల్లయ్య, జవహర్‌బాబు, మురళీ మోహన్, ఎస్ఐలు సరస్వతి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు పూల మాల వేసిన అధికారులు, సిబ్బంది






















భార్యకు ప్రేమతో...



నేడు సతీమణిని ప్రశంసించే రోజు

ఉద్యోగం.. వ్యవసాయం.. వ్యాపారం..! ఏదైనా సరే పురుషులు చేస్తారు.. స్త్రీలూ చేస్తారు. సూటిగా చెప్పాలంటే.. భార్యభర్తలు ఇద్దరూ చేస్తారు. కానీ భర్త ఆ పనికి మాత్రమే పరిమితమౌతారు. కానీ ఆమె అలా కాదు. ఆయనతో సమంగా బయట కష్టపడుతూనే.. ఇంటి పనులు, వంట పనులు, పిల్లల చదువులు, బంధువులొస్తే సపర్యలు.. ఇలా అన్నీ చూసుకోవాలి. తేడా వస్తే మగ మహారాజులతో మాటలు పడాలి. ఇది కొందరికి మాత్రమే అర్థమౌతుంది. కానీ అందరూ అర్థం చేసుకోవాలి. ఆమెను గౌరవించాలి. ఉద్యోగం, వ్యాపారం.. ఏవీ చేయకుండా ఇంటి పట్టున ఉన్నా సరే.. ఆమెకు తీరిక ఉండదు. అందరూ నిద్ర లేవకముందే మేల్కొనాలి. అందరూ నిద్రపోయాక తను నిద్రకు ఉపక్రమించాలి. ఈ రెండింటి నడుమ ఆమె పడే శ్రమను గుర్తించి.. గౌరవించాలి కదా..? ఆమెకు తోడుగా నిలబడాలి కదా..? అప్పుడే కదా తన కళ్లలో ఆనందం కనిపించేది..! ఇదే ఉద్దేశంతో ఏటా సెప్టెంబరు మూడో ఆదివారం 'భార్యలను ప్రశంసించే రోజు'గా ప్రపంచం నిర్వహించుకుంటోంది. భార్య పడే శ్రమకు తగిన గుర్తింపు ఎలా లేదో.. ఈ రోజుకు కూడా అలాగే.. పెద్దగా గుర్తింపు లేదు. అందుకే.. ఉమ్మడి జిల్లాలోని కొందరు ప్రముఖులను ఆంధ్రజ్యోతి పలకరించింది. అతని గురించి ఆమెను, ఆమె గురించి ఆయనను అడిగితే.. సిగ్గుల మొగ్గలు తొడిగారు. మరో ప్రపంచంలో విహరించారు. భావోద్వేగానికి గురయ్యారు. ఆ విశేషాలతో ప్రత్యేక కథనం..!

ఆమె శ్రమను గుర్తించాలని గుర్తు చేసే రోజు.. తను ఎంత ముఖ్యమో ఆలోచించాల్సిన రోజు



'నేను ఐఏఎస్ అయ్యాక విధి నిర్వహణలో తీరిక లేకుండా ఉంటున్నాను. అందుకే బంధువులను చాలావరకూ కలవలేను. కానీ బంధాలు దూరం కాకుండా నా భార్య చూసుకుంటుంది. అందరితో సన్నిహితంగా మెలుగుతుంది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటుంది. ఆ విషయంలో తనను మెచ్చుకుంటూ ఉంటాను. తను డాక్టర్. మైక్రో బయాలజీలో ఎండీ చేశారు. టీచింగ్ ప్రొఫెషన్ అంటే తనకు ఇష్టం. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మానవ సంబంధాలకు ఆమె ఎంతగానో ప్రాధాన్యం ఇస్తారు. అందుకే వైద్య విద్యార్థులు నా భార్యను బాగా ఇష్టపడతారు..' అని తన అర్ధాంగి డాక్టర్ భూమిక చంద్రలాలి గురించి ఎంతో గొప్పగా వర్ణించారు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.

బంధాల భూమిక..!

వైవాహిక జీవితం గురించి ప్రశ్నించగానే ఆయన సిగ్గుపడిపోయారు. ముఖంలో సీరియస్ నెస్ మాయమై.. నవ్వులు విరిశాయి. 'ఎప్పుడైనా మేడమ్‌ను మెచ్చుకున్నారా..? ఏ విషయంలో..?' అని అడగ్గానే ఆయన బంధాలు, బంధుత్వాల గురించి మాట్లాడారు. అవి తమకు ఎంత ముఖ్యమో చెప్పకనే చెప్పారు. బంధువులతో తన భార్య టచ్‌లో ఉంటారని, ఎవరినీ దూరం కానివ్వరని, ఆ విషయంలోనే ఎప్పుడూ మెచ్చుకుంటుంటానని అన్నారు. 'భార్యమీద ఏదో ఒక సందర్భంలో కోప్పడటం సహజమే కదా..? అలా ఏమైనా జరిగిందా..?' అంటే, అలాంటి పరిస్థితి ఇంతవరకూ రానేలేదని అన్నారు. ఇకపై ఎప్పుడూ వచ్చే అవకాశం కూడా లేదని తన భార్యపై అపార నమ్మకం ప్రకటించారు. 'నేను ఎక్కువగా వృత్తి ధర్మం గురించే ఆలోచిస్తాను. కానీ తను తన వృత్తితోపాటు మా కుటుంబ భవిష్యత్తు గురించి కూడా ఆలోచిస్తుంది. అవసరం మేరకే ఖర్చు పెడుతుంది. భవిష్యత్తు అవసరాలకు పొదుపు పాటిస్తుంది. ఇవి కూడా నాకు ఆమెలో నచ్చే గుణాలు..' అని అన్నారు.



'పెళ్లంటే ఏడేడు జన్మల బంధం అంటారు కదా..? అందుకే భూమిక నాకు దొరికిందేమో..! నాపై ప్రేమ, అభిమానాన్ని ఏనాడూ దాచుకోదు. నిరంతరం పంచుతూనే ఉంటుంది. తను దొరకడం నా అదృష్టం. ఆమె నా జీవితానికి ఒక కానుక. అందుకే తనకు కానుకలు ఇవ్వడం నా హాబీ..! విధి నిర్వహణలో భాగంగా ఎక్కడికి వెళ్లినా.. ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా దొరికే వస్తువులు ఏమిటో తెలుసుకుని.. కొని తెచ్చి ఇస్తుంటాను. మంగళగిరిలో ఉన్నప్పుడు మంగళగిరి పట్టుచీరలు, ఉప్పాడ వెళ్లినప్పుడు అక్కడి పట్టుచీరలు.. జిల్లాకు వచ్చాక ధర్మవరం పట్టుచీరలు కొని కానుకగా ఇచ్చాను..' అని సంబరపడిపోయారు.

'పెళ్లి కాకమునుపు ఎప్పుడూ పని చేస్తూ ఉండేవాడిని. కానీ ఆమె నా జీవితంలోకి వచ్చాక ప్రతి పనినీ ప్రణాళికాబద్ధంగా చేయడం నేర్చుకున్నాను. ఇంటి నుంచి బయట అడుగు పెట్టగానే నేను కలెక్టర్..! విధి నిర్వహణ తప్ప వేరే ఆలోచన ఉండదు. ఇంటికి వెళ్లాక నేను మా కుటుంబంలో సభ్యుడిని. అక్కడ పాలనాపరమైన అంశాలపై ఎలాంటి చర్చ, ప్రస్తావన ఉండదు. కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తాను.. అంతే..' అని అన్నారు. ప్రస్తుతం తన భార్య గర్భిణి అని, ఇంటిపట్టునే ఉంటున్నారని అన్నారు. ఒకరికి ఒకరు కానుకగా మారిన కలెక్టర్ దంపతులకు.. ఉమ్మడి కానుక త్వరలో అందనుందన్నమాట..!

- అనంతపురం టౌన్



మా ఆయన బంగారం..!

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

'ఆయన జనజీవన స్రవంతిలోకి కలిశాక మా ఇంటికి చాలామంది వచ్చేవారు. అందరికీ భోజనం పెట్టమనేవారు. అప్పటికి ఇంట్లో వంట మనుషులు లేరు. ఎవరినీ నమ్మే పరిస్థితి లేదు. అందుకే నేను, మా అత్త కలిసి కష్టపడి వండి పెట్టేటోళ్లం. అందరూ వెళ్లిపోయాక ఆయన నా వద్దకు వచ్చేవారు. 'పని ఎక్కువైంది కదా..? ఇబ్బందిగా ఉందా..? కాళ్లు పీకుతున్నాయా..?' అని అడిగేవారు. ఒక భార్యకు అంతకు మించిన ప్రశంస ఏముంటుంది..? పైకి గంభీరంగా కనిపించినా.. మా ఆయన మనసు బంగారం..' అన్నారు మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత.



'ఆయన ఏది చెప్పినా నేను చేస్తాను అని నమ్మేవారు. 2004లో పెనుకొండ ఎమ్మెల్యేగా ఆయన పోటీ చేశారు. ఆ సమయంలో ఉమ్మడి జిల్లా బాధ్యతలను ఆయనే చూసుకుంటున్నారు. అందుకే పెనుకొండ ప్రచార బాధ్యతలను నాకు అప్పగించారు. ఆయన కోరిక మేరకు ప్రచారం చేశాను. నియోజకవర్గవ్యాప్తంగా పర్యటించాను. నా కాళ్లకు బొబ్బలు వచ్చాయి. ఎన్ఎస్ గేటు వద్ద నన్ను చూశారు. నా పట్టుదలను మెచ్చుకున్నారు. డాక్టర్‌ను పిలిపించి దగ్గరుండి నాకు వైద్యం చేయించి వెళ్లారు..'

'బయట ఎన్ని సమస్యలున్నా ఇంట్లోకి వచ్చాక వాటి ప్రస్తావన తెచ్చేవారు కాదని, తనతో, పిల్లలు, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపేవారని గుర్తు చేసుకున్నారు. 'ఆయనకు వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. పొలం పనులకు వచ్చేవాళ్లతో వారానికి ఒకసారి ఇంటి బయట మంచమేసుకుని కూర్చొని మాట్లాడేవారు. వారితో కలిసి భోజనం చేసేవారు. నన్ను, పిల్లలను ఎంతగానో ప్రేమించేవారు. తన వెంట వస్తే ఏదైనా జరగవచ్చునన్న ఆలోచనలో పిల్లలను ఎన్నడూ వెంట తీసుకెళ్లేవారు కాదు. ఆయనకు చదువంటే ఇష్టం. పిల్లలను బాగా చదివించాలని అనుకునేవారు. ఇక్కడి వాతావరణానికి దూరంగా హైదరాబాదులో మా బంధువుల ఇంట్లో ఉంచి చదివించారు. పిల్లలను నాకు చూడాలనిపించేది. మారం చేసేదాన్ని. ఆయన కోప్పడినా.. ఆ తరువాత హైదరాబాదుకు పంపేవారు..' అని కుటుంబాన్ని పరిటాల రవీంద్ర ఎంత బాగా చూసుకునేవారో గుర్తు చేసుకున్నారు.

'ఎన్ని సమస్యలున్నా.. మా పెళ్లి రోజు ఆయనకు ప్రత్యేకం. స్వయంగా చీర కొని తెచ్చేవారు. ఒకసారి ఏకంగా 27 చీరలను మా పెళ్లి రోజు కానుకగా కొని తెచ్చి ఇచ్చారు. నా ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఆయన ఉండగా.. చివరి పెళ్లి రోజుకు తెచ్చి ఇచ్చిన చీరను ఇప్పటికీ భద్రంగా దాచుకున్నాను. అది అపురూపమైన కానుక..' అని చెబుతూ.. భావోద్వేగానికి గురయ్యారు.



చివరి కానుక.. ఈ చీరే..

'చివరి రోజున కూడా ఆయనతోనే ప్రయాణించాను. వెంకటాపురం నుంచి అనంతపురం వెళ్లాము. పార్టీ మీటింగ్ చూసుకుని మధ్యాహ్నం భోజనానికి వస్తానని చెప్పారు. ముద్ద, చట్నీ చేయమన్నారు. ఆ తరువాత ఫోన్ చేశారు. తాను అక్కడే భోజనం చేశానని, మమ్మల్ని తినమని చెప్పారు. అవే ఆఖరి మాటలు. కాసేపటికే విషయం తెలిసింది. అరవింద నగర్‌లోని ఇంటి నుంచి పార్టీ కార్యాలయానికి పరుగున వెళ్లాం. రక్తపు మడుగులో కనిపించారు. ఆ క్షణం నుంచి ఆయన ఆశయాలను నా భుజనా వేసుకున్నా. మమ్మల్ని నమ్ముకున్నవారికి అండగా ఉంటున్నా..'

- అనంతపురం టౌన్

ఇల్లు.. ఇల్లాలు..!

ఇదే ఆనందం.. సింపుల్..! ఎస్పీ జగదీష్

'ఇంటిని చూసి ఇల్లాలిని చూడాలి..' అంటారు కదా పెద్దలు..! ఇంటిని అందంగా, ఆహ్లాదంగా మార్చేసే ఇల్లాలు తనకు దొరికిందని సంబరపడిపోయారు ఎస్పీ జగదీష్..!

పోలీసుల జీవితం ఎలా ఉంటుందో తెలియంది కాదు..! ఖాకీ దుస్తులు ఒంటిపై ఉన్న సమయంలో టార్చిలైట్ వేసి వెతికినా వారి ముఖంలో నవ్వు కనిపించదు. నేరాలు, నేరస్థులు, శాంతిభద్రలు..! నేర పరిశోధనలు, కేసులు.. ఒత్తిళ్లు! ఇలాంటి అంశాలతో డీల్ చేసేవారి ముఖంలో నవ్వులను ఎలా వెతుక్కోగలం..? పోలీసులను చూడగానే జనంలో ఒక రకమైన భయం కలగడానికి ఇదీ ఒక కారణం..! అనుక్షణం సవాళ్లతో కూడిన వృత్తిలో ఉండే పోలీసులు.. కుటుంబ జీవితాన్ని బ్యాలెన్స్ చేయడం అంత తేలిక కాదు..! భార్య, పిల్లలతో గడిపేందుకు ఒక్కోసారి ఏమాత్రం సమయం దొరకదు..! 'ఇలాంటి క్లిష్టమైన శాఖలో.. కీలకమైన ఎస్పీ స్థానంలో ఉన్నారు. జీవితం ఎలా ఉంది సర్..?' అని అడిగితే.. 'ఏముందీ.. నేను నా విధి నిర్వహణ గురించి ఆలోచిస్తాను.. ఆమె నా గురించి ఆలోచిస్తుంది.' అని తన భార్య హేమ గురించి ఒక్క మాటలో చెప్పేశారు ఎస్పీ జగదీష్..!

'ఎప్పుడైనా.. ఏ విషయంలోనైనా మెచ్చుకున్నారా..? మీకు తను ఎంత ముఖ్యమో చెప్పారా..?' అని అడిగితే.. 'పండుగల సమయంలో ఇంటి వాతావరణాన్ని సమూలంగా మార్చేస్తుంది. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అందంగా తీర్చిదిద్దుతుంది. ఇల్లు ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఆ విషయంలో మెచ్చుకోకుండా ఉండలేను. పండుగ సమయాలలో ఆమెను ప్రశంసిస్తుంటాను..' అని ఎంతో సంతోషంగా చెప్పారు. 'ఒక్కోసారి అనుకున్న విధంగా చేయలేం. అనుకోని సంఘటనలు జరుగుతుంటాయి. హడావుడిగా వెళ్లాల్సి వస్తుంది. అలాంటి సమయంలో భార్య బాధపడటం సహజం కదా..? తనూ బాధపడుతుంది. తిరిగి రాగానే ఓదారుస్తాను. అర్థం చేసుకుంటుంది..' అని అన్నారు. అర్థం చేసుకునే భార్య దొరకడం ఒక వరం..! పోలీసు అధికారులకు ఇంకాస్త ఎక్కువ వరం..!



'2018 నవంబరు 25న మా వివాహం జరిగింది. మాకు మూడేళ్ల బాబు.. పేరు శ్రీహాన్. నా జీవన విధానం చాలా సింపుల్‌గా ఉంటుంది. పెళ్లికి ముందు మరీ సింపుల్‌గా ఉండేది. అలాంటి సోఫా మీద (తనకు ఎదురుగా ఉన్న సోఫాను చూపుతూ..) కూడా సర్దుకుని నిద్రపోవడం అలవాటు. పెళ్లయ్యాక బాధ్యతలు పెరిగాయి. విధి నిర్వహణతోపాటు కుటుంబానికీ సమయం కేటాయించాల్సి వస్తోంది. ఒక్కోసారి భార్యాపిల్లలతో గడపడం సాధ్యం కాదు. సెప్టెంబరు 3న మా బాబు బర్త్ డే..! మరుసటి రోజే నా పుట్టిన రోజు కూడా..! సెలబ్రేట్ చేసుకోవాలని ముందుగానే ప్లాన్ చేసుకున్నాం. కానీ విజయవాడలో వరదల కారణంగా, అక్కడ సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వెళ్లాల్సి వచ్చింది. ఇలాంటివి తరచూ జరుగుతుంటాయి. హేమ అర్థం చేసుకుంటుంది..'



'మా మధ్య దాపరికాలు ఉండవు. ప్రతి విషయాన్ని తనతో షేర్ చేసుకుంటాను. అప్పడప్పుడు టూర్ ప్లాన్ చేస్తుంది. ఎక్కడికి వెళ్లాలో నిర్ణయిస్తుంది. ఫ్లైట్ టిక్కెట్స్, రూమ్, భోజనం.. అన్ని విషయాలూ తనే చూసుకుంటుంది. నాపై ఆధారపడదు. స్వేచ్ఛగా వ్యవహరిస్తుంది. ఆ విషయం నాకు ఎంతగానో నచ్చుతుంది. జనవరి 19న తన పుట్టిన రోజు. నాకు ప్రత్యేకం. ఆ రోజు ఏదో ఒక కానుక తప్పనిసరిగా ఇస్తుంటాను. చీరలు, జ్యువెలరీ, మొబైల్ ఫోన్.. ఇలా ఏదో ఒకటి..!'

- అనంతపురం క్రైం

అన్నింటా వెన్నంటే..!

జేసీ ప్రభాకర్ రెడ్డి

'అదృష్టం ఏమిటంటే.. నా భార్యకు రాజకీయాలు, వ్యాపారం అంటే చాలా ఇష్టం. ఈ రెండు అంశాల్లోనూ ఆమె వెనకుండి సలహాలు ఇస్తుంది. విజయవంతం కాగానే ఆమెను మెచ్చుకుంటాను. నా కష్టసుఖాల్లో ఆమె వెన్నంటి ఉంటుంది. మనో ధైర్యాన్ని ఇస్తుంది..' అని తన సతీమణి ఉమ గురించి చెప్పారు మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి. జేసీ కుటుంబం పేరు చెబితే ఎప్పుడూ గరం గరం అంశాలే గుర్తుకు వస్తాయి. వేడి వేడి రాజకీయాలు, వాడీవేడి మాటల తూటాలే గుర్తుకొస్తాయి. పైకి ఇలా కనిపించే నాయకులు కుటుంబ విషయంలో కాస్త నాజూకుగానే ఉంటారు. భార్య, పిల్లలను అమితంగా ఇష్టపడుతుంటారు. అదే జాబితాలో ఉన్నారు జేసీ ప్రభాకర్ రెడ్డి.



'ఉమ నా జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాతే మొత్తం మారిపోయింది. నేను చేసే ప్రతిపనిలోనూ ఆమె ఉంటుంది. నా విజయానికి తోడ్పడుతుంది. వ్యాపారం, రాజకీయంలో ఆమె సలహాలే నాకు శిరోధార్యం. ప్రతి విషయంలోను ఆమె సలహాలు, సూచనలు పాటించడం నాకు అలవాటు. అవి విజయవంతమైనప్పుడు తనను మెచ్చుకుంటాను. ప్రతికూల ఫలితం వచ్చినప్పుడు కాస్త కోపగించుకుంటాను. మెచ్చుకున్నా.. కోపగించుకున్నా.. ఆమె నన్ను ఏమీ అనదు..' అని తన జీవితంలో భార్య ప్రాధాన్యమేమిటో వివరించారు.

'మా కుటుంబంలో అందరికీ కోపం ఎక్కువ. కానీ నా భార్య మాత్రం ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటుంది. అది ఆమెకు దేవుడి ఇచ్చిన వరం. భూమాతకు ఉన్నంత ఓర్పు తనకు ఉండడం నాకు నచ్చిన విషయం. ఎంత కష్టం వచ్చినా ఆమె ముఖంపై చిరునవ్వు చెరగదు. మా ఇంట్లో పనివాళ్లను కూడా ఆప్యాయంగా పలకరిస్తుంది. వారి కష్టాలను తెలుసుకుని సాయపడుతుంది. ఆమెకు ఉన్నంత ఓపిక, ఓర్పు నాకు లేవు..' అన్నారు నవ్వుతూ..!

'నా భార్యకు సింప్లిసిటీ చాలా ఇష్టం. మా అమ్మకు సంబంధించిన బంగారు నగలు ఉన్నాయి. వాటి గురించి ఎప్పుడూ పట్టించుకోదు. బంగారం అంటే ఆమెకు పెద్దగా ఇష్టం లేదు. మెడలో ఒక చైన్ మాత్రమే వేసుకుంటుంది. కానీ చేతికి కట్టుకునే వాచ్‌లు అంటే చాలా ఇష్టం. వాటిని కొనిద్దామని అనుకుంటాను. కానీ వద్దంటుంది. తానే కొనుకుంటాను అంటుంది..' అని చెబుతూ.. కానుకలు ఇచ్చే భాగ్యం కూడా తనకు ఇవ్వడం లేదని సరదాగా అన్నారు.

- తాడిపత్రి

నా ఇష్టాలను గౌరవిస్తారు..!

భర్త గురించి మంత్రి సవిత

'ఆయనకు వ్యవసాయం ఇష్టం. రైల్వే కాంట్రాక్టర్ కూడా..! ఎప్పుడూ బిజీగా ఉంటారు. నాకు సేవ చేయడం ఇష్టం. ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారికి అండగా నిలవడం ఇష్టం. ఒకసారి మాట ఇచ్చానంటే నెరవేర్చి తీరుతాను. ఇవన్నీ ఆయనకు ఇష్టం. కొవిడ్ సమయంలో బయటకు వచ్చేందుకే వణికిపోయారు అందరూ. అలాంటి సమయంలో బాధితులకు అండగా నిలవాలని బయటకు వచ్చాను. వందలాది మందికి కొవిడ్ కిట్లు, నిత్యావసర సరుకులను అందజేశాను. ఇలాంటివి ఎన్నెన్నో..! సాయం చేసే గుణం నా తండ్రి ఎస్ఎస్ రామచంద్రారెడ్డి నుంచి నాకు అబ్బింది. ఆయన మార్గంలోనే నడుస్తున్నాను. నా ఆలోచనలను గౌరవించే భర్త నాకు దొరికారు. అది నా అదృష్టం' అన్నారు మంత్రి సవిత.





తన భర్త వెంకటేశ్వరరావు ప్రోత్సాహంతోనే రాజకీయాల్లో ఒడిదుడుకులను అధిగమించి, మంత్రి అయ్యానని అన్నారు. అన్నింటా తోడుగా నిలిచే భర్త లభించడానికి మించి ఒక మహిళకు కానుక ఏముంటుందని వ్యాఖ్యానించారు. 'ప్రజా సమస్యలపై పోరాడే క్రమంలో నాపై 14 కేసులు నమోదు చేశారు. సీబీఐ దాడులు కూడా చేయించారు. సుమారు 55 రోజులపాటు ఒంటరిగా గడపాల్సి వచ్చింది. అలాంటి సంక్షోభ సమయంలో ఆయన నాకు తోడుగా నిలిచారు. న్యాయం కోసం ఎంత దూరమైనా వెళదామని ధైర్యం నూరిపోశారు. ఎన్నడూ ఆయన నాపై కోప్పడిన సందర్భమే లేదు..' అని అన్నారు. 'వివాహం కారణంగా నేను కోల్పోయింది ఏమీ లేదు. పైగా ఒక గొప్ప భాగస్వామిని పొందగలిగాను. ఆయన ఏనాడూ నా ఇష్టానికి వ్యతిరేకంగా నడుచుకోరు. తనకు భక్తి ఎక్కువ. అందుకే ఆలయాల సందర్శనకు ఎక్కువగా వెళుతుంటాము. సమస్యలు ఎదురైతే చర్చించుకుని పరిష్కరించుకుంటాము. నేను మంత్రిని అయినా.. ఆయన తీరులో మార్పు లేదు. మునుపటిలాగే సాధారణ పౌరుడిలా వ్యవహరిస్తారు. అహంకారం, అధికార దర్పం ఆయన దరికి చేరవు..' అని అన్నారు.

భార్యలను ప్రశంసించే రోజు నేపథ్యంలో.. 'ఎప్పుడైనా.. ఏ విషయంలోనైనా మెచ్చుకున్నారా..?' అని అడిగితే.. భర్తను మెచ్చుకుంటూ.. రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారు మంత్రి సవిత.

- పెనుకొండ టౌన్

నేనే ఆమె తొలి ప్రతిపక్షం



'మా వైవాహిక జీవితానికి 16 ఏళ్లు..! ఎన్నడూ తనను పొగిడింది లేదు. తను రాజకీయాల్లో ఉంది. విమర్శలను నా నుంచే మొదట ఎదుర్కొంటుంది. ఒక రకంగానే నేనే ఆమెకు తొలి ప్రతిపక్షం. సభలు, సమావేశాల్లో మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడమని సూచిస్తాను. సబ్జెక్టు తెలిస్తేనే మాట్లాడమని నిక్కచ్చిగా చెబుతాను. ఏమీ తెలియనప్పుడు మాట్లాడటం కంటే మౌనంగా ఉండటం మంచిదని చెబుతాను..' అని అన్నారు జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ భర్త నరసింహ మూర్తి. వైవాహిక జీవితంలో చిటపటలు సహజమేనని, తాను కోపగించుకున్నా మౌనంగా స్వీకరిస్తుందని అన్నారు. 'ఈ పదహారేళ్లలో నేను కోప్పడటేమగానీ.. గిరిజను బుజ్జగించిన సందర్భాలు లేవు..' అని నవ్వుకుంటూనే అన్నారు. మొత్తానికి పోలీసు అనిపించుకున్నారు..! కానీ ఇంటర్ చదువుతున్న అమ్మాయిని పెళ్లి చేసుకుని.. ఇంట్లో బంధించలేదు. తనకు చదువుకునే స్వేచ్ఛ, రాజకీయాల్లో ప్రవేశించే స్వేచ్ఛను కల్పించారు.

'మొదట్లో తను వంటలు తెలియని పిల్ల. నాకు అన్నీ వచ్చు. బ్రహ్మాండంగా వంట చేస్తాను. నా నుంచే గిరిజ నేర్చుకుంది. పెళ్లయిన తర్వాతే ఇంటర్ పూర్తి చేసింది. డిగ్రీ పూర్తి చేసింది. ప్రస్తుతం లా చేస్తోంది. రాజకీయాల్లో ఉంటూనే చదువు కొనసాగిస్తోంది. ఆమె ఇష్టాన్ని నేను గౌరవిస్తాను. చదువుకుంటాను అంటే ఏనాడూ అభ్యంతరం చెప్పలేదు. ప్రోత్సహిస్తూనే ఉన్నాను. రాజకీయాల్లోకి వెళ్లినా అభ్యంతరం చెప్పలేదు. ప్రజల సమస్యలపై పోరాడుతుంటే ప్రోత్సహించాను. ఇప్పుడు తను జడ్పీ చైర్‌పర్సన్..! అయినా పొగిడేది లేదు. విమర్శలే చేస్తాను. నా కూతురు చేతన కూడా విమర్శలు చేస్తుంది..' అని ఇంట్లో ప్రతిపక్ష పాత్ర గురించి చెప్పుకొచ్చారు నరసింహమూర్తి.

అంటే.. గిరిజమ్మ నిత్యం ఇంట్లో నెట్ ప్రాక్టీస్ చేస్తున్నట్టు..! బయట ఎలాంటి విమర్శలు ఎదురౌతాయో, వాటికి ఎలా సమాధానాలు చెప్పాలో తండ్రీకూతుళ్లు శిక్షణ ఇస్తున్నారన్నమాట..!



నో.. నేను పొగడనంతే..!

భర్త ప్రోత్సాహం ఉంటే మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలుగుతారు. ఇందుకు ఉదాహరణ.. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ జీవితం. ఇంటర్ విద్యార్థినికి ఇంట్లోవాళ్లు పెళ్లి చేసినా.. ఉన్నతంగా చదివించే భర్త ఆమెకు లభించారు. వంటలు రాని భార్యకు వండిపెట్టి, వంట నేర్పి, చదివించి, రాజకీయాల్లోకి వెళ్లే స్వేచ్ఛను ఇచ్చి.. ప్రోత్సహిస్తున్నారుగానీ.. ఒక్కసారి కూడా 'నువ్వు సూపర్ గిరిజా..' అని పొగిడిందే లేదట..! పోలీసు అయినంతమాత్రాన భార్యను పొగడటం మానేస్తే ఎలా మూర్తిగారూ..?

తనే నా వంటల మాస్టర్..!



'ఇంటర్ సెకెండ్ ఇయర్ చదువుతున్నప్పుడే నాకు పెళ్లి కుదిరింది. పెద్దలు మాట్లాడుకున్నారు.. పెళ్లి చూపులు అయ్యాక రెండు వారాల్లోనే పెళ్లి చేసేశారు. మా ఆయన హైదరాబాద్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసేవాడు. పెళ్లి జరిగిన రెండు వారాలకే అక్కడ కాపురం పెట్టించారు. ఇంట్లో గారాబంగా పెరిగాను. పెద్దగా వంటలు రావు. పప్పు, అన్నమే నాకు వచ్చే పెద్ద వంటలు..! ఆ రెండింటితో సర్దుకోలేక ఆయన నా మీద చిందులు వేసేవారు..' అని చెబుతూ నవ్వు ఆపుకోలేకపోయారు జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ. 'ఆయనకు వంటలు బాగా వచ్చు. చికెన్ రెసిపీ, బిర్యానీ, డబుల్ కా మీఠా, పాయసం, వెజిటబుల్ రైస్.. ఇలాంటివన్నీ బాగా చేసేవారు. చెఫ్ మాస్టర్ అవతారం ఎత్తారు. వంటలు చేయడం నేర్పించారు..' అని నవ్వుకుంటూనే గుర్తు చేసుకున్నారు.

'2014లో కార్పొరేటర్‌గా నా రాజకీయ జీవితం మొదలైంది. కాలనీల్లో సమస్యలపై పోరాడేదాన్ని ఆయన నన్ను బాగా ప్రోత్సహించారు.

ఆయన ప్రోత్సాహంతోనే కొవిడ్ సమయంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఆయన మాటలు, విమర్శలే నన్ను రాజకీయంగా రాటుదేలేలా చేస్తున్నాయి. నేను ఏదీ అడగాల్సిన అవసరం లేదు. ఆయనే గుర్తించి.. అన్నీ సమకూరుస్తారు. చీరలు, ఆభరణాలు.. అన్నీ ఆయన ఇచ్చిన కానుకలే. ఆయన నా జీవితంలోకి వచ్చాక బాధపడిన క్షణాలు లేవు. చిటపటలన్నీ జీవితంలో భాగమే కదా..! అవి కూడా మంచి జ్ఞాపకాలు నాకు..' అని సంతోషం వ్యక్తం చేశారు.

- అనంతపురం విద్య

లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించండి

కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 14: గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ వినోద్ కుమార్ వైద్య శాఖ అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అమలు పరిచే గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై అమలుకు సంబంధించి జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశాన్ని ఆయన శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి నిర్వహించారు. వీడియా కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు పాల్గొన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఈబీదేవి, ఆర్డిటీ హెల్త్ డైరెక్టర్ దుర్గేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఒకరోజు



శ్రీనివాసుడికి గరుడవాహనసేవ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 14 : సాయి ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని శ్రీ7 కన్వెన్షన్ హాల్‌లో శనివారం శ్రీవారి సేవలో ఒకరోజు పేరుతో వెంకటేశ్వర వైభవం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవంతో పాటు వివిధ సేవలను నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉమాదేవి, విద్యానృసింహభారతి స్వామి, జిల్లా న్యాయాధికారి శ్రీనివాసులు, అడిషనల్ కోర్టు న్యాయాధికారి శోభారాణి హాజరై స్వామిని దర్శించుకున్నారు. అనంతపురంతోపాటు ఇతర జిల్లాలనుంచి సైతం భక్తులు పెద్దసంఖ్యలో తదలివచ్చారు.

ఘనంగా నిట్‌కాన్ చంద్ర జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న చంద్ర కుటుంబసభ్యులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు14 : నిట్‌కాన్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత నిట్‌కాన్ చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను ఆయన కుటుంబసభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి వద్ద రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 250 మంది రోగులు, వారి కుటుంబసభ్యులు అన్నదానం స్వీకరించారు. కార్యక్రమంలో చంద్ర కుటుంబసభ్యులు, బంధువులు, నిట్‌కాన్ కన్‌స్ట్రక్షన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి మహీంద్రా థార్ రాక్స్



మార్కెట్‌లోకి మహీంద్రా థార్ రాక్స్ వాహనాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 14: మహీంద్రా కంపెనీ నుంచి మరో వాహనం మార్కెట్‌లోకి వచ్చింది. ఎంజీబీ మొబైల్స్ మహీంద్రా షోరూంలో శనివారం ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో మహీంద్రా థార రాక్స్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఎంజీబీ మొబైల్స్ సీఈఓ ఆదిత్య మాచాని, జనరల్ మేనేజర్-సేల్స్ వంశీ కృష్ణ కస్తమర్లతో వాహనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా సీఈఓ ఆదిత్య మాచాని మాట్లాడుతూ... ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో మహీంద్రా థార రాక్స్ అత్యాధునిక టెక్నాలజీ, ఐకానిక్ డిజైన్‌తో వచ్చిందన్నారు. ఈసెగ్మెంట్ ప్రపంచంలోనే అతి పెద్ద సన్ రూఫ్‌తో, సురక్షితమైన రోడ్ గ్రిప్ కోసం 19ఇంచుల అల్లాయ్‌వీల్స్ కలిగి ఒక బెంచ్ మార్క్‌ను ఏర్పరచిచందన్నారు. మొట్టమొదటి సారిగా థార్‌లో అడ్వాస్ లెవెల్-2 ఫీచర్స్‌తో ఉన్న ఈ వాహనం ఎక్స్ షోరూం ధర రూ.12.99లక్షలతో ప్రారంభం అవుతుందన్నారు. ఏడు రంగుల్లో లభిస్తుందని వివరించారు. ఈకార్యక్రమంలో సర్వీస్ జనరల్ మేనేజర్ రామక్రిష్ణ, సేల్స్ మేనేజర్ మస్తాన్ వలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 14: నగరానికి చెందిన మహదేవనాయుడు కుమారులు దినేష్ చౌదరి, శ్యామ్‌సుందర్ చౌదరి విద్యాభ్యాసంకోసం అమ్మ సంస్థ రూ.2.60లక్షలు సాయం అందించింది. మొదటి సెమిస్టర్ ఫీజు తదితరాల కోసం శనివారం సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల రమణారెడ్డి విద్యార్థులకు అందజేశారు.

ఇమామ్, మౌజాన్లకు ఆర్థికసాయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు14: ఇమామ్, మౌజాన్లకు ఆర్థిక సాయం అందజేశారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అల్‌హాజ్ కేఎం షకీల్ షఫీ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దాదాపు 300మందికి తనవంతుగా రూ.5లక్షలను అందజేశానని తెలిపారు. వారి సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీనాయకుడు షౌకత్ ఖాన్ పాల్గొన్నారు.

'శాస్త్రీయ దృక్పథంతోనే మానవ పురోగతి'

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 14: శాస్త్రీయ దృక్పథంతోనే మానవ పురోగతి సాధ్యమని ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఏఐపీఎస్‌ఎన్) మాజీ అధ్యక్షుడు ఆచార్య సవ్య సాచి చటర్జీ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని జీఆర్ ఫంక్షన్ హాల్‌లో జనవిజ్ఞాన వేదిక 17వ వార్షిక మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆచార్య భాగ్యవతి హాల్‌లోని ఆదినారాయణ ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. సమతా కన్వీనర్ డాక్టర్ ప్రసూన జాతీయ పతాకాన్ని, జేవీవీ నాయకుడు డాక్టర్ రంగన్న జేవీవీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన నిర్వహించిన సభకు ఏఐపీఎస్‌ఎన్ మాజీ అధ్యక్షుడు సవ్యసాచి చటర్జీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి జేవీవీ గౌరవాధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సామాజిక కార్యకర్త బోస్ తదితరులు పాల్గొన్నారు.

దులీప్ ట్రోఫీలో సెంచరీల మోత



స్టేడియం వద్ద అభిమానుల కోలాహలం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 14: అనంతపురం ఆర్డీటీ మైదానాల్లో జరుగుతున్న దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీ లలో మూడో రోజు శనివారం మూడు సెంచరీలు నమోద య్యాయి. ఇండియా-ఎ జట్టు రెండో ఇన్నింగ్స్ వికెట్ నష్టానికి 115 పరుగులతో ఆట ప్రారంభించి.. 98 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 380 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇండియా- డి జట్టు 488 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ పారంభించి, మూడో రోజు ఆటముగిసే సమయానికి 19 ఓవర్లలో వికెట్ నష్టానికి 62 పరుగులు చేసింది. ఇండియా-ఎ జట్టు బ్యాట్స్‌మన్ ప్రథమ్ సింగ్ 189 బంతుల్లో 12 బౌండరీలు, ఒక సిక్సర్ సాయంతో 122 పరుగులు సాధించారు. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ 56 పరుగులు చేశారు. తిలక్‌వర్మ 193 బంతుల్లో 9 బౌండరీల సహాయంతో 111 పరు గులు చేశారు. రియాన్ పరాగ్ 20 పరుగులు, షాషావత్ రావత్ 64 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. ఇండియా-డి బౌలర్లు సౌరభ్ కుమార్ 2, శ్రేయాస్ అయ్యర్ ఒక వికెట్ తీసుకున్నారు. విజయం కోసం ఇండియా-డి జట్టు మరో 426 పరుగులు సాధించాల్సి ఉంది. చేతిలో తొమ్మిది వికెట్లు ఉన్నాయి.

సెంచరీతో చెలరేగిన కెప్టెన్ అభిమన్యు ఈశ్వర్

మరో మ్యాచ్‌లో ఇండియా-బి కెప్టెన్ అభిమన్యు ఈశ్వర్ సెంచరీతో చెలరేగారు. 143 పరుగుల తో నాటౌట్‌గా నిలిచాడు. ఓవర్ నైట్ స్కోర్ 36 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 124 పరుగులతో మూడో రోజు ఆటను బి జట్టు ఆరంభించింది. కెప్టెన్ అభిమన్యు ఈశ్వర్ 262 బంతుల్లో 12 బౌండరీలు, సిక్సర్ సాయంతో 143 పరుగులు చేశారు. మరో ఓపెనర్, వికెట్ కీపర్ జగదీశన్ 137 బంతుల్లో 8 బౌండరీల సాయంతో 70 పరుగులు చేసి ఔట్ అయ్యారు. ఆ తరువాత వచ్చిన ముషీర్‌ఖాన్ (1), సర్ఫరాజ్‌ఖాన్(16), రింకూసింగ్ (6), నితీష్‌రెడ్డి (2), వాషింగ్టన్ సుందర్ (13), సాయికిశోర్ (21) తక్కువ స్కోర్లకు పరిమితమయ్యారు. మూడోరోజు ఆట ముగిసే మయానికి ఇండియా-బి జట్టు 101 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 309 పరుగులు సాధించింది. క్రీజ్‌లో కెప్టెన్ అభిమన్యు ఈశ్వర్ (143), రాహుల్ చాహర్ (18) ఉన్నారు. ఇండియా-సి బౌలర్లు అన్షుల్ కాంబోజ్ 5 వికెట్లు, విజయ్‌కుమార్ వైశాక్, మయాంక్ మార్కండే చెరో వికెట్ తీశారు. సి జట్టు మొదటి ఇన్నింగ్స్ 525 పరుగులు సాధించిన విషయం తెలిసిందే. నాలుగో రోజు కూడా బి జట్టు మొదటి ఇన్నింగ్స్ ఉన్నందున, మ్యాచ్ డ్రా అయ్యే అవకాశం కనిపిస్తోంది.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు ఉద్యోగి మృతి

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు14: మండలపరిధిలోని వడియంపేట వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొని పూజారి రాఘవేంద్ర (40) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తాడిపత్రి పట్టణానికి చెందిన పూజారి నాగేంద్ర వడియంపేట వద్ద ఉన్న నారాయణ జూనియర్ కళాశాలలో అకౌంటెంట్‌గా పని చేస్తు న్నాడు. ఆయన శనివారం కళాశాలలో పని ముగించుకుని దిచక్రవా హంనలో అనంతపురానికి వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో నాగేంద్ర వాహనం రోడ్డు డివైడర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నాగేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై బుక్కరాయ సముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు.

చెన్నేకొత్తపల్లి వద్ద వెల్డర్...

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 14: మండలకేంద్రం సమీపంలోని హెచ్ ఎన్ఎస్ఎస్ కాలువ వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వెల్డర్ అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరు గాయప డ్డారు. అనంతపరం పట్టణం గుల్‌జార్ పేటకు చెందిన షేక్ తుమ్మల కుంట మథిన్(48) వెల్డింగ్ పనులు చేస్తుండేవాడు. సొంత పని మీద తన వద్ద పనిచేసే మహమ్మద్ గౌస్ అనే వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంలో లేపాక్షికి వెళ్తున్నాడు. చెన్నే కొత్తపల్లి హెచ్ఎన్ఎస్ఎస్ కాలువదాటిన తరువాత ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో మథిన్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న మహమ్మద్ గౌస్ గాయాలయ్యాడు. మథిన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వా స్పత్రికి తరలించారు. గాయపడిన మహమ్మద్ గౌస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఇసుకను తరలిస్తున్న టిప్పర్ సీజ్

శింగనమల, సెప్టెంబరు14: అనుమతులు లేకున్నా ఇసుకను తరలి స్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు. మండలంలోని పోతురాజుకాలువ గ్రామ సమీపంలో వంక నుంచి అక్ర మంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను శనివారం సాయంత్రం సీజ్ చేసినట్లు తెలిపారు.

'ఉపాధ్యాయులు... నిత్యవిద్యార్థులు'

అనంతపురం విద్య, సెప్టెంబరు 14: ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నా రు. ఆ సంఘం అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన స్వర్ణోత్సవ క్రీడా సంబరాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధానకార్యదర్శి లింగమయ్య, ఇతర నాయకులు రామప్ప, రాఘవేంద్ర, ప్రమీళ తదితరులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ నుంచి సెంట్రల్ యూనివర్సిటీకి...

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 14 : పంజాబ్‌కు చెందిన హితిక్ సోఫాత్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తిచేసి సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ అడ్మిషన్ పొందారు. కూటమి ప్రభు త్వం ఏర్పాటుతో సెంట్రల్ యూనివర్సిటిపై ప్రత్యేక శ్రద్ధవహిస్తోంది. 2024-25 సంవత్సరానికి సంబంధించి సకాలంలో ప్రవేశాలు నిర్వహిస్తుండటంతో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలనుంచి విద్యార్థులు సైతం తరలివస్తున్నారు. 24 కోర్సుల్లో ఇప్పటికే 700 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని వీసీ ప్రొఫెసర్ కోరి పేర్కొన్నారు.

17 నుంచి స్వచ్ఛతాహి సేవ

రాప్తాడు, సెప్టెంబరు 14: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 17 నుంచి అక్టోబరు 1 వరకూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్‌రాజ్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయ వంతం చేయాలని ఆయన సూచించారు.

'జిల్లాలో దులీప్‌ట్రోఫీ నిర్వహణ శుభపరిణామం'

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 14: వెనుకబడిన జిల్లాలో జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు దులీప్‌ట్రోఫీ నిర్వహించడం శుభపరిణామమని సీనియర్ క్రికెటర్లు పేర్కొన్నారు. దులీప్‌ట్రోఫీ పోటీలకు వచ్చిన సీనియర్ క్రికెటర్లు శనివారం ఏసీజీలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. సీనియర్ క్రికెటర్లు సత్యనారాయణ పబ్బతి, పగడాల మల్లికార్జున, లక్ష్మీనారాయణ, బడ్డీ శ్రీధర్, పరమేష్, రవి ప్రకాష్, చంద్రలాల, సంపత్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రవాణాశాఖ మంత్రిని కలిసిన ఆర్టీసీ అధికారులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 14: రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని అనంత ఆర్టీసీ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురానికి శనివారం వచ్చిన మంత్రిని స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో అనంతపురం రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని, డిప్యూటీ సీటీఎం రమేష్‌బాబు, డీఎం నాగభూపాల్, లా ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, బస్టాండు మేనేజర్ కేఎస్ మూర్తిలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

అనంతవాసులకు పురస్కారాలు



దేవరకొండ కౌసల్య బృందాన్ని సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 14: అనంతపురం నగరానికి చెందిన ఓం సంగీత నృత్యకళానిలయం నాట్యాచార్యురాలుతో పాటు ఆమె శిష్య బృందానికి పురస్కారాలు వరించాయి. సోమలరాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బెంగుళూరులోని ఆ ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం నగరానికి ఓం సంగీత నృత్యకళానిలయం నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్యకు భారత సేవారత్న పురస్కారం, ఆమె శిష్యబృందం కుందనిక, సమృద్ధి, లాస్య, భార్గవి, తేజోవతి, శిరీష, రాధ, చంద్రకళ, సుబ్బలక్ష్మి, అనురాధలకు నాట్యమయూరి పురస్కారాలను ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ చక్రవర్తి, సోమలరాజుల చేతులమీదుగా అందజేసి సత్కరించారు.

బ్రిడ్జిల నిర్మాణానికి ఆమోదం

అనంతపురం, సిటి, సెప్టెంబరు 14: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని ప్రజలకు, ఆయా ప్రాంతాలకు వెళ్లే వారికి కొన్నేళ్లుగా నెలకొన్న ప్రయాణ కష్టాలు త్వరలో తీరనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో రోడ్లన్నీ చాలా అధ్వానస్థితికి చేరుకుని ప్రజలు చాలా అవస్థలు పడ్డారు. ముఖ్యంగా జిల్లాలో హెచ్చెల్సీపై కణేకల్లు బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. బెళుగుప్ప మండలం రామసాగరం వద్ద పెన్నా నదిపై బ్రిడ్జి లేదు. దీంతో ఆయా నియోజకవర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసుల చొరవతో ఆ రెండు బ్రిడ్జిల నిర్మాణానికి ఆమోదం లభించినట్లు తెలిసింది. ఉరవకొండ, కణేకల్లు ప్రధాన రహదారిలో హెచ్చెల్సీపై కణేకల్లు వద్ద నిర్మించిన బ్రిడ్జి పూర్తి శిథిలావస్థకు చేరడంతో అధికారులు రాక పోకలు ఆపేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం ఎన్‌డీబీ (న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు) కింద రూ.40 కోట్లతో శ్రీకారం చుట్టింది. తాడిపత్రికి చెందిన ఓ సంస్థకు టెండర్ దక్కినా పనులు జరుగలేదు. ఇప్పుడు ఎమ్మెల్యే కాలవ చొరవతో కణేకల్లు బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే ఉరవకొండ ఎమ్మెల్యే, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో కూడేరు, రామసాగరం రోడ్డుపై రామసాగరం వద్ద పెన్నా నదిపై హైలెవల్ వంతెన (బ్రిడ్జి) నిర్మాణానికి రూ.90 కోట్ల నిధులతో ప్రభుత్వానికి నివేదిక పెట్టించారు. త్వరలోనే పనులు జరగనున్నాయి. ఆ రెండు బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించి ఆర్అండ్ బీ ఈఎన్‌సీ నయీముల్లా ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు.

తాగేందుకు గుక్కెడు నీరివ్వండి

● ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు



రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 14: పట్టణంలోని కొల్లాపురం గుడి వద్ద మహిళలు తాగేందుకు గుక్కెడు నీరివ్వాలని ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి శనివారం నిరసన తెలిపారు. దీంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. 30 నిమిషాలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. రోజూ ట్యాంకర్లతో నీటిని తీసుకుని కాలం గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని అధికారులతో మాట్లాడి మీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. తొమ్మిది రోజుల నుంచి శ్రీరామిరెడ్డి, శ్రీసత్యసాయి వాటర్ కార్మికులు సమ్మెలోకి వెళ్లిన కారణంగా నీటి సమస్య ఏర్పడింది.

జీబీసీ గండి పూడ్చివేత



గండిని పూడ్చిన అధికారులు, నాయకులు

విడపనకల్లు, సెప్టెంబరు 14: మండలంలోని గుంతకల్లు బ్రాంచ్ కాలువకు నాలుగు రోజుల క్రితం పడిన గండిని జీబీసీ అధికారులు, టీడీపీ నాయకులు కలిసి పూడ్చివేశారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆ దేశాలతో జీబీసీ అధికారి పల్లవి, టీడీపీ నాయకులు పాల్తూరుకు చెందిన కాలువ మానయ్య, గడేకల్లు శ్రీనివాసు చౌదరి గండి పడిన ప్రాంతంలో మూడు రోజులు దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. అనంతరం 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గండిని సకాలంలో పూడ్చి పనులు పూర్తి చేయటంతో మంత్రి పయ్యావుల కేశవ్‌కు, టీడీపీ నాయకులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చంద్రబాబు, మంత్రి కొల్లురవీంద్ర చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న సీఐ, సిబ్బంది

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 14: పట్టణంలోని రాజేంద్రనగర్ ప్రొహిబిషన్ అండ్ఎక్సైజ్ స్టేషన్‌లో శనివారం ఎక్సైజ్ సీఐ పురషోత్తం, సిబ్బంది సీఎం చంద్రబాబునాయుడు, మంత్రికొల్లు రవీంద్ర చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. గత ప్రభుత్వ హయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూ రోగా ఉండగా టీడీపీ ప్రభుత్వం తిరిగి ఎక్సైజ్ శాఖగా విలీనం చేశారు. ప్రొహిబిషన్ అండ్ఎక్సైజ్ స్టేషన్‌లో నేమ్ బోర్డు ఏర్పాటు చేసి సీఎం చంద్రబాబు, మంత్రి కొల్లురవీంద్ర చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక అవాస్తవ కథనాలు

గుత్తి, సెప్టెంబరు14: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుత్తి ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణ చేపట్టిన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఓ పత్రికలో అసత్య కథనాలు ప్రచురించారని టీడీపీ నాయకులు ఖండించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, సంపత్‌కుమార్, న్యాయవాది సోమశేఖర్, రియాజ్, జనసేన పాటిల్ సురేష్, ఎమ్మార్పీఎస్ సునీత మాట్లాడారు. గుత్తి, ఆర్‌ఎస్‌లలో నారాయణ పలు అభివృద్ధి పనులు చేపడుతూ, ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు.

లోక్ ఆదాలత్‌లో పలు కేసుల పరిష్కారం

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 14: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌ఆదాలత్‌లో పలు కేసులు పరిష్కరించారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి జీ మంజుల మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్‌ఆదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. రైల్వే, జూనియర్ సివిల్ కోర్టులో 784 కేసులు పరిష్కరించారు. ఏపీపీ హేమలత, లోక్‌ఆదాలత్ సభ్యులు సీ వెంకటేశ్వర్లు, ఎండీ బాబాతాజుద్దీన్, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు యూనుస్‌ఆహ్మద్ పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని జూనియర్ సివిల్‌కోర్టు ప్రాంగణంలో శనివారం అనంతపురం అడిషనల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి నిర్మల ఆధ్వర్యంలో లోక్‌అదాలత్ నిర్వహించారు. 70క్రిమినల్ కేసులు, 5సివిల్ కేసులను పరిష్కరించినట్లు న్యాయాధికారి తెలిపారు. సీనియర్ న్యాయవాది భాస్కర్‌రెడ్డి, అనిఫబాషా, శివయ్య, సూర్యనారాయణ, సతీష్ పాల్గొన్నారు.

ఉరవకొండ: లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని ఉరవకొండ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ దుర్గాకల్యాణి తెలిపారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. 82 కేసులు పరిష్కరించినట్లు న్యాయాధికారి తెలిపారు.

గుత్తి: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్‌ఆదాలత్ నిర్వహించారు. ఏడీజే శ్రీహరి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కాశీవిశ్వనాథచారి 115 కేసులను పరిష్కరించి, బాధితులకు రూ.3.27కోట్లు నష్టపరిహారం చెల్లించేలా తీర్పు చెప్పారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని కోర్ట్ ఆవరణంలో శనివారం అనంతపురం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ప్రతిభ అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 270 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరి చక్రవర్తి, సీనియర్ న్యాయవాది దేవేంద్రప్పపాల్గొన్నారు.

తీరనున్న కష్టాలు..!

- కణేకల్లు బ్రిడ్జికి రూ.40 కోట్లు
- ప్రజలకు తప్పనున్న ప్రయాణ అవస్థలు
- నేడు ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ పర్యటన

అనంతపురం, సిటీ, సెప్టెంబరు 14 : రాయదుర్గం, కళ్యాణ దుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని ప్రజలకు కొన్నేళ్లుగా నెలకొన్న ప్ర యాణ కష్టాలు త్వరలో తీరనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పా లనలో నిర్లక్ష్యం వహించడంతో రోడ్లన్నీ చాలా అధ్వాన స్థితికి చేరు కుని ప్రజలు చాలా అవస్థలు పడ్డారు. ముఖ్యంగా జిల్లాలో హెచ్చెల్సీపై కణేక ల్లు బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని, బెళుగుప్ప మండలం రామసాగరం వద్ద పెన్నా నదిపై బ్రిడ్జి లేకపోవడంతో ఆయా నియోజక వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో మూడు నెలలక్రితం టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసుల చొరవతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆ రెండు బ్రిడ్జిల నిర్మాణానికి ఆమోదం లభించినట్లు తెలిసింది. ఉ రవకొండ, కణేకల్లు ప్రధాన రహదారిలో హెచ్చెల్సీపై కణేకల్లు వద్ద నిర్మిం చిన బ్రిడ్జి పూర్తి శిథిలావస్థకు చేరడంతో అధికారులు రాక పోకలు ఆపే శారు. దీంతో కణేకల్లు చుట్టు పక్కల గ్రామాల వారు కణేకల్లు రావా లంటే 15 కిలోమీటర్లు చుట్టేసి రావాల్సి వచ్చింది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం ఎన్‌డీబీ (న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు) కింద రూ. 40 కోట్లతో శ్రీకారం చుట్టింది. తాడిపత్రికి చెందిన ఓ సంస్థకు టెండర్ దక్కి నా పనులు జరుగలేదు. ఇప్పుడు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చొర వతో కణేకల్లు బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అలాగే ఉరవకొండ ఎమ్మెల్యే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో కూడేరు, రామసాగరం రోడ్డుపై రామసాగరం వద్ద పెన్నా నదిపై హైలెవల్ వం తెన (బ్రిడ్జి) నిర్మాణానికి రూ. 90 కోట్ల నిధులతో ప్రభుత్వానికి నివేదిక పెట్టించారు. త్వరలోనే పనులు జరగనున్నాయి. ఆ రెండు బ్రిడ్జిల నిర్మాణంపై పరిశీలించేందుకు ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ జిల్లాకు రానున్నారు. త్వరలో పనులు జరిగి ఆయా ప్రాంతాల ప్రజలకు ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. బ్రిడ్జిలను ఈఎన్‌సీ నయీముల్లా పరిశీలించనున్నారు.



కణేకల్లు వద్ద హెచ్చెల్సీ కాలువపై శిథిలావస్థకు చేరిన వంతెన

● ప్రభుత్వం అనుమతి రాగానే.. పనులు: ఎస్ఈ, ఆర్‌అండ్‌బీ

ఈ రెండు పనులకు సంబంధించి త్వరలోనే అనుమతి రానుంది. అనుమతి రాగానే పనులు వేగవంతంగా చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రజా ప్రతినిధుల చొరవతో అభివృద్ధి పనులకు నాంది పడుతోంది. ఈ రెండు బ్రిడ్జిల పనులు పూర్తయితే ఎన్నో గ్రామాల ప్రజలకు ఉపయోగకరం.

హెచ్చెల్సీలో ఆళ్లగడ్డ వాసి గల్లంతు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 14: మండలంలోని ఉంతకల్లు గ్రామ శివారులో ఉన్న హెచ్చెల్సీ కాలువలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన ఓ వ్యక్తి గల్లంతైన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు శనివారం ఏకాదశి సందర్భంగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన రాజ్‌కుమార్(51) అనే వ్యక్తి ఉంతకల్లు గ్రామంలోని రుక్మిణీపాండురంగస్వామి ఆలయానికి తులసీమాల ధరించేందుకు వచ్చాడు. స్నానం చేసేందుకు హెచ్చెల్సీ కాలువలో దిగి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. వారి కుటుంబసభ్యులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు టిప్పర్ల సీజ్

డీ.హీరేహాళ్, సెప్టెంబరు 14: ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. కర్ణాటక ప్రాంతానికి సంబంధించిన రెండు టిప్పర్లు మండల శివారు ప్రాంతంలో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎస్ఐ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లారు. మట్టిని తరలిస్తున్న టిప్పర్లను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి టిప్పర్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

పామిడి: స్థానిక పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తుండడంతో సీఐ యుగంధర్ సిబ్బందితో దాడి జరిపి ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఒక టిప్పర్‌తో పాటు ఆరు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 14: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన దళిత శ్రీనివాసులు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీనివాసులు మద్యానికి బానిసై భార్యను డబ్బులు అడిగారన్నారు. ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్థాపం చెంది మద్యం మత్తులో పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడన్నారు. కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

విడపనకల్లు, సెప్టెంబరు 14: మండలంలోని పెద్ద కొట్టాల పల్లి వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడటంతో ముగ్గురు గాయపడిన ఘటన శనివారం రాత్రి చోటు చేసకుంది. పోలీసులు తెలిపిన మేరకు ఉరవకొండ పట్టణానికి చెందిన ప్రేమ్‌కుమార్, పవన్, ఖాదర్ వ్యక్తి గత పని మీద శనివారం ఉదయం బళ్లారికి కారులో వెళ్లారు. పని ముగించుకుని రాత్రి ఉరవకొండకు బయలు దేరారు. పెద్ద కొట్టాల పల్లి వద్ద హంద్రీనివా కాలువ వద్దకు రాగానే కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. కారులో ఉన్న ముగ్గురూ గాయపడ్డారు. గమనించిన స్థానికులు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనానికి నిప్పంటించిన దుండగులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 14: మండలంలోని ఇమాంపురం గ్రామంలో టీడీపీ నాయకుడు రంగస్వామికి చెందిన యూనికాన్ ద్విచక్రవాహనానికి శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. రాత్రి ఇంటి ముందుర దిచక్రవాహనం ఉంచగా అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప సంఘటనస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మృతిపై అధికారుల ఆరా

కూడేరు, సెప్టెంబరు 14: రామచంద్రపురం గ్రామంలో డెంగీతో చంద్రకళ మృతిపై వైద్యాధికారులు ఆరా తీశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా మలేరియా అధికారి ఓబులు, సబ్‌యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్ నూర్ పాషా, శ్రీధర్ మూర్తి గ్రామంలో పర్యటించారు. చంద్రకళ మృతిపై కుటుంబ సభ్యులతో వివరాల అడిగి తెలుసుకున్నారు.

ఇరువర్గాల ఘర్షణ

కుందుర్పి, సెప్టెంబరు 14: మండలంలోని తూముకుంట గ్రామంలో నీటి కుళాయి ఏర్పాటు విషయంలో శనివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు జగదీష్ తాగునీటి సరఫరా కోసం పైపులైన్‌కు పక్కనే వున్న నాగభూషణం ఇంటి ముందు నుంచి సీసీ రోడ్డుపై కాలువ ఏర్పాటు చేస్తుండగా నాగభూషణ దానిని అడ్డుకోవడంతో కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. చుట్టుపక్కల వారు ఇద్దరిని సముదాయించి పం పించేశారు. తిరిగి 9 గంటల సమయంలో మరోసారి గొడవకు దిగారు. దీంతో మాటామాటా పెరిగి ఇరు కుటుంబాలు ఒకరిపై ఒకరు దాడి చే సుకున్నారు. ఇద్దరు గాయపడగా జగదీష్ ఆయన భార్య రోజా అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో నాగభూషణ కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు ఉద్యోగి మృతి

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు14: మండల పరిధిలోని వడియంపేట వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని పూజారి రాఘవేంద్ర (40) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తాడిపత్రి పట్టణానికి చెందిన పూజారి నాగేంద్ర వడియంపేట గ్రామం వద్ద ఉన్న నారాయణ జూనియర్ కళాశాలలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. శనివారం కళాశాలలో పని ముగించుకుని ఆయన అనంతపురానికి వెళ్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని టూవీలర్ ఢీకొట్టింది. నాగేంద్ర నడుపుతున్న వాహనం రోడ్డు డివైడర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. బుక్కరాయసముద్రం పోలీసు కేసు నమోదు చేసుకున్నారు. రాఘవేంద్రకు భార్య, కుమారుడు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

వందశాతం ఈకేవైసీ పూర్తి చేయాలి

రాయదుర్గంరూరల్/గుమ్మఘట్ట/బొమ్మనహాళ్, సెప్టెంబరు 14: నియోజకవర్గంలోని అన్ని రైతుసేవ కేంద్రాల్లో రెండురోజుల్లో వంద శాతం ఈకేవైసీ పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం మండలంలోని ఆవులదట్ల రైతు సేవ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పలు రైతు సేవ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశామన్నారు. ఆవులదట్ల రైతు సేవా కేంద్రం ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మానాయక్, ఏవో మహేంద్ర, నిర్మల్‌కుమార్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. అనంతరం గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం గ్రామంలో వ్యవసాయాధికారి వేరుశనగ పంటను పరిశీలించారు. బొమ్మనహాల్ మండలంలో సాగుచేసిన పంటల వివరాలను ఈ పంటలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. నేమకల్లు గ్రామంలో ఈ పంట నమోదును పరిశీలించారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న సందిరెడ్డి శ్రీనివాసులు

గుత్తి, సెప్టెంబరు14: సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి మధుకర్ సూచించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం గుంతకల్లు, తాడిపత్రి బీజేపీ అసెంబ్లీ నాయకుల సమక్షంలో పార్టీ సభ్యత్వ నమోదు అభియాన్ ఇన్‌చార్జిల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి మధుకర్, రాయలసీమ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి సావిత్రి, జిల్లా ఇన్‌చార్జి లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డిశ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే కాపురామచంద్రరెడ్డి హాజరై మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వాన్ని వేగవంతం చేయాలని సూచించారు. తిమ్మారెడ్డి, నారాయణరెడ్డి, బాలకృష్ణ, నారాయణ, ఆకులశ్రీనివాసులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే బీజేపీతోనే సాధ్యమని జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసలు అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ వాసవీ కళ్యాణ మండపంలో కళ్యాణదుర్గం, రాయదుర్గం అసెంబ్లీ శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలన్నారు. ముప్పూరి దేవరాజు, లలిత్ కుమార్, లక్ష్మీనారాయణ, చిరంజీవిరెడ్డి, వసుంధరమ్మ, బంగారు మల్లారెడ్డి, హిరోజీరావు, అశోకరెడ్డి పాల్గొన్నారు.